# నీలాటిరేవు

శ్రీమతి
ఎ. పద్మావతిదేవిగారు

## తిండికి తికమకలు

★

నీలాటిరేవులో ...

"రండి రండి! అక్కయ్యగారూ! ఏమిటి విశేషాలు? ... అన్నట్లు ... మీయింట్లో నిన్నరాత్రి కేకలు వినిపించా యెందుకండీ?!" అన్నాది ప్రక్కింటి యిల్లాలు, బిందెతోముతూ.

"ఆ ...! అదా? - అబ్బే! ఏమీలేదు. దొంగవెధవ పెరటింటిలోఁ జొరబడి ... చద్దన్నం దేవుకొని పట్టుకు పోయాడు! వీడికక్కర్తిమండా!" అన్నాది చంకలో బింది మెట్లపైఁ పెడుతూ.

ఇదివిని; "అబ్బా ఎంత విచిత్రంగావుంది!" అని ముక్కుమీద వేలుపెట్టుకొని అన్నాదో పూర్వసువాసిని.

"అవునుమరి! తిండికోసం దొంగతనమని ఆశ్చర్య మెందుకు? ఎవరుయేపాటుఁ బడ్డా సాపాటుకే కదా! పొట్టకోసమే యీతిప్పలన్నీ! ఆకలిమంటలమ్మా! ఆకలిమంటలు!!! ... తిండికి దొంగతనమే కాదు; ఇకముందు దోపిడులు కూడా జరుగుతాయి!!" అన్నాదో నవనాగరిక నాజూకుపిల్ల, గాజులు సవరించుకొంటూ.

"నిజం! నిజం!! చిన్నపిల్లవైనా బాగా చెప్పేవమ్మా! - మేం ప్రత్యక్షంగా ఆ బాధ అనుభ విస్తున్నాం! ఆకలిబాధ అంటే మాకు తెలుసు! ఒకపూట తింటే రెండవపూట ఉపవాసమే! ఎప్పుడైనా యింత అన్యాయం వుందీ? డొక్కమాలిన కరువు బాగావచ్చింది - తెగవు తెంపూ లేకుండా వుంది ..." అని ఒకబీద యిల్లాలు అంటూవుండగా, ... ...

"అవును దొడ్డమ్మగారూ! మనం తిండిలేకపోతే సద్దుకోగలం కాని, పిల్లలు వూరుకోకుండా వున్నారండీ! వాళ్ళకు యేంచెప్పినా అర్థం కాకుండా వుందండీ! 'అమ్మా! అన్నమే' అంటూరు. వాళ్లను చూస్తే గుండె నీరైపోతున్నాదండీ!" అని తన ఆవేదన వెళ్ళకక్కింది ఓ అమ్మ.

'ఆగండమ్మా! నేచెప్తా దీనిని గురించి,' అంటూ "మనం యెందుకు బ్రతికివున్నాం! ముఖ్యంగా తినడానికే. తిండిపూర్తిగా లేకపోతే బ్రతుకేలేదు! చూడమ్మా పాపం! ఎంతమంది కాలం మీదవున్న వాళ్లు-బక్క చిక్కి చొక్కి చప్పిదవడలతో కళాకాంతులు లేకవున్నారో! ఇట్టివారు పాపం కొన్ని చిత్ర విచిత్రమైన యెడతెగని వ్యాధులకు గురియై అకాలమరణం పొందుచున్నారు! ఎందుచేత? సరియైన పుష్టి నిచ్చు సుపోషకమైన భోజనము లేకపోవుట వలనేకదా ... ఏమంటారు?" అనగానే బుగ్గమీద వేలు వేసు కొని వింటున్న ఒకస్త్రీ వుషారుగా చేతులు తిప్పుతూ;

"దీనంతటికీ కీలకం రేషను విధానంలో వుంది!" అన్నాది ... ...

"అవును యిటువంటి ఆవక తవక విధానాలుంటే తిండికి యెన్ని తికమకలైనా వస్తాయి! ఈయిచ్చే

రేషను సరిగా తింటే సగం రోజులకైనా సరిపడదు! పోతే దీనివల్ల చీకటి బజారు వర్తకానికి బాగా ప్రోత్సాహం యిస్తున్నాది. లంచాలూ పంచాలూ పుచ్చుకోడానికి అవకాశ మిస్తున్నాది. అమానుషంగా అన్యాయంగా యేమీ యెరగని బీదవారిని బాధించడానికి ఉపయోగపడుతున్నాది! అయినదానికీ కానిదానికీ ప్రతిదానికీ రేషనుపెట్టి మనకది దొరకకుండా చంపేస్తున్నారు!" అని ఒక శ్రీమతి వుద్రేకంతో వుపన్యసించగా.

"అవునమ్మా! ఈరేషనులు వలన మనంపొందుచున్న కష్టాలు నష్టాలూ తలుచుకొంటూవుంటే గుండెలు గుభేలు మంటున్నాయి. ఈదిక్కుమాలిన విధానాలకు యెప్పుడు గాలి వస్తుందో!!!" అన్నదో పెద్దముత్తైదువ ప్రాణం విసిగి!

"అవశ్యం మీరన్నమాట నిజమౌతుంది దొడ్డమ్మగారూ! త్వరలో; మునిసిపాలిటీలలో తప్ప మిగతా ప్రాంతాలలో రేషను తీసేయడానికి సంప్రతింపులు జరుగుతున్నాయి! బహుశా తీసేస్తారుట కూడా! అని ఒకగాలికబురు విన్నాం!!" అన్నాది చదువుకొన్న వోచిన్నది.

"తల్లీ! మాచల్లని కబురు చెప్పేవు! నీనోటి కబురైనా నిజమై, అదేజరిగితే, యింతగంజి త్రాగైనా బ్రతుకుతాం!" అంటూ నీళ్లునుంచుకొని నడకప్రారంభించింది ... తరువాత, మిగిలిన గృహలక్ష్ములు కూడాత మపని ముగించుకొని, యింటిముఖం పట్టేరు. వచ్చేవాళ్లు వస్తూనే వున్నారు! వెళ్లేవాళ్లు వెళుతూనే వున్నారు. జరిగేచర్చలూ; కాన్ఫరెంసులూ జరుగుతూనే వున్నాయి!... ...





జండుబాలామృతము

క్షీణించి అనారోగ్యవంతులుగా నుండు బిడ్డలకిది యమృతమువంటిది. వారికి ఆకలిని వృద్ధిపరచి ఆరోగ్యము నిచ్చును.

పిల్లలకు దంతములు మొలుచునప్పుడు కలుగు నొప్పులను పోగొట్టును. కాళ్లుచేతులు శుష్కించి కడుపు పెద్దదిగా నున్న బిడ్డలకిది దివ్యౌషధము. జీర్ణించిన జలుబు, దగ్గు మొదలగు వాటినికూడ నివారించును.

బుడ్డి ఒకటికి రూ. **1-2-0.**

రాజా అండుకో., నంద్యాల.
దుర్గా మెడికల్ స్టోర్సు, కావలి
రావు మెడికల్ స్టోర్సు, పాలకొల్లు
రాధాకృష్ణా మెడికల్ స్టోరు, నరసపూరు

పి. సీతారామయ్య, ఎలమంచిలి
కుసుమంచి అప్పలరాజు, అనకాపల్లి
నీలం & కో., విశాఖపట్టణం.
దుర్గ & సన్సు, కర్నూలు.